# పిరికివాడి ధైర్యం

శశాంక తన ఎఱ్ఱ గుఱ్ఱంమీద నాలుగు ఊళ్ళు తిరిగొస్తుంటాడు ఉద్యోగరీత్యా. చేతిలో వో టిప్‌టాప్ సూట్‌కేసు కళ్ళకు చలువజోడు కాళ్ళకు అంబాసిడర్ బూటు. మూతిమీద కొద్దిగా కొన తిరిగిన మీసం. ఆ పెట్టె పట్టుకుని బూట్లు టకటకలాడించుకుంటూ 'మే ఐ కమిన్ సర్!' అంటూ ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ల కన్‌సల్టింగ్ రూమ్‌లోకి వెళతాడు. రకరకాల మందులూ బహుమతులూ, ఆ డాక్టర్లకిచ్చి, వాళ్ళ దగ్గర్నుంచి వాగ్దానాల్నీ, గుడ్ విషెస్‌నూ అందిపుచ్చుకుని, హుషారుగా మెట్లుదిగుతుంటాడు.

'అర్ధరాత్రీ అపరాత్రీ అని లేకుండా ఆ టూర్లేమిటి? మోటారు సైకిలుమీద తిరుగుతూ దానికి ఎఱ్ఱగుఱ్ఱం అని పేరు పెట్టుకుని ఆ ఊరేగడ మేవిటీ?' అంటూ అర్ధాంగి అపర్ణమూర్తి ముడిస్తే 'దట్స్ మై డార్లింగ్!' అనేసి అపతలకు తప్పుకునేవాడు.

అపర్ణకేంతెలుసు ఆ ఎఱ్ఱగుఱ్ఱంమీద తన ఎడ్వెంచర్, ఎఱ్ఱ గుఱ్ఱమూ స్వప్నా లేకుండా తను బ్రతగ్గలడా.

తను బిఎస్సీ రెండో సంవత్సరంలో వుండగా కామోసు ఆ సంఘటన జరిగింది. క్లాస్‌మేట్స్‌లో చాలామంది బొటానికల్ టూరుకు అరకు వేలీకి వెళ్ళారు.

'నువ్వొద్దురా కన్నా. నీకా కొండగాలి వొంటికి పడదు' అన్నది బామ్మ.

'వెళ్ళన్లేవే!' అన్నాడు తను అట్లాగే వెళ్ళలేరుకూడాను.

సాయంత్రం చల్లగాలికోసమని గోదావరి ఒడ్డుకు వెళ్ళాడు. ఇంట్లో బోరుకొడుతూ ఎంతసేపని కూచోడం? గోదావరి బ్రిడ్జీమీద రైలు వెళు

తున్న దృశ్యం ఎంతో బావుంటుంది. గోదావట్లో మెల్లగా సాగిపోయే పడవలు జీవన భారాన్ని మోయలేక మోయలేక అలసిపోయినట్లు తనకు కన్పిస్తాయ్. గట్టుమీద తమ పొడుగాటి జడల్ని అటూ ఇటూ ఊపుకుంటూ, చకచకా ఎకసక్కలాడుకుంటూ నడిచిపోయే పడుచుపిల్లలు గట్టుపక్కనే వున్న గుళ్ళముందు సాగిలపడి దన్నాలుపెట్టే మూఢభక్తులు అక్కడా ఇక్కడా జంగిడీల్లో తినుబండారాలమ్ముకునే చిన్న చిన్న అమాయకపు పిల్లలు సాయంత్రం వచ్చిందంటే చాలు, ఆ ప్రాంతం ఒళ్ళువిరుచుకుని శృంగారం చేసుకుంటుంది. మెరకవీధిలోని ఆడంగులు తమ పౌడరు మొహాల్ని-కిటికీలగుండా బయటకు చూపెడుతుంటారు. రహదారీపడవల్లోంచి రంజురంజుగా పాటలు వినిపిస్తుంటాయి. నవ్వుకుంటూ నడిచే చిలకలూ గోరింకలూ ఒకదానిపై మరొకటి పడిపోతుంటాయి. కాస్లీహోటళ్ళవైపుగా కార్లు పరుగెడుతుంటాయి. మోయలేని భారంతో రిక్షాలు ముందుకు జారిపోతుంటాయి. పడమటి ఆకాశం ఎర్రబడుతుంది. పరుగెత్తే గోదావరి పచ్చబడుతుంది.

తను వంటరిగా గోదావరి గట్టంట నడుస్తున్నాడు. గట్టుమీది చెట్టునూ, చెట్టుమీది పిట్టనూచూస్తూ.

పిట్టను చూస్తుంటే స్వప్న కనిపించింది. స్వప్నమున స్వప్న సుందరి తెల్లచీర కట్టుకుంది. తల్లో తెల్లరోజా పెట్టుకుంది. తెల్లటి జాకెట్ మీద ముత్యాలదండ వేసుకుంది. తెల్లటి స్లిప్పర్, తెల్లటి ప్లాస్టిక్ గాజులు....

'తెల్ల చీర కట్టుకున్న దెవరికోసమూ....' తన మనసులో పాట బయటకు రాదేం?

అంతలో ఆమె తనను చూడనే చూసింది. నవ్వింది. వయ్యారంగా నడుస్తూ దగ్గరకు వచ్చింది. 'హలో' టూర్‌కు వెళ్ళలేదా?'

'లేదు నువ్వు....'

'కనిపిస్తున్నాకదా....ఇక్కడే....నీ ఎదుట....'

'ఎందుకని వెళ్ళలేదూ?'

'నువ్వెందుకు వెళ్ళలేదూ?'

'మా బామ్మ వెళ్ళవద్దంది.' అనబోయి, తమాయించుకుని 'ఆ కొండ గాలి నా వొంటికి పడదు.' అన్నాడు.

'అని ఎవరు.... మీ బామ్మ చెప్పిందా?

తను సమాధానం చెప్పలేదు స్వప్న 'నాకు తెలుసులే' అన్నట్లుగా కిలకిలా నవ్వింది. పగడాలు కింద రాలాయి. 'సమయానికి నేను ఊళ్ళో లేకపోయాను ఉంటే తప్పకుండా వెళ్ళివుండేదాన్ని.'

'పోనీ ఇప్పుడు బయలుదేరి వెళ్ళు'

'ఎట్లా? మా డాడీ కారుతీసుకుని హైదరాబాద్ పోయారు 'స్వప్న దిగాలుగా మొహంపెట్టింది. 'పోనీ ఎవరిదగ్గరన్నా స్కూటరో, మోటారు సైకిలో అన్నా వుంటే బావుండేవి. ఝుమ్మని వెళ్ళిపోయి వుండేవాళ్ళం'.

'నాకే మోటారుసైకిలు వుందనుకో వస్తావా?' తను అనుకోకుండా అడిగాడు.

'నీకు.... నీకు.... మోటారుసైకిలుందా....' కెన్ యూ డ్రైవ్ ఎ మోటార్ బైక్....'

'బై ఆల్ మీన్స్'

'అయితే మనిద్దరం రేపు వెళ్దామా? మనల్ని చూసి సురేంద్ర మోహన్ శశికళ, స్వరూప, అన్నపూర్ణా, మదన్ అందరూ దంగైపోతారు. ఏం పోరూ?—నేను నీ వెనగ్గా కూచుంటాను. పడకుండా నిన్ను గట్టిగా పట్టుకుంటాను. గాలికి ఓ చెంగు ఎగిరిపోతుంటే సన్నగా కూనిరాగం తీసుకుంటూ నిన్ను ఇన్స్పయిర్ చేస్తుంటాను. ఏం వెళ్ళొద్దా మనం?....'

ఆ అమ్మాయి అడిగే తీరులోనే శాసించే గుణంకూడా వుంది. ఆ కళ్ళల్లో వెన్నెలతీగలున్నాయి. ఆమె ఊహకే అయస్కాంత గుణం వుంది.

'అట్లాగే? ఎల్లుండి వెళ్దాం—బీ రెడీ!' అనేసి శంకాక ఇంటికి తిరిగి వచ్చాడు. వస్తున్నప్పుడు ఇంటికీ, గోదారిగట్టుకూ దూరం తగ్గినట్లని

పించింది. గాలి మందమందంగా గుసగుసలు పోతున్నట్లుంది. ఆకాశంలో పల్టీలు కొడుతున్న పేరు తెలీని పిట్టలు తనని చూసి ఆనందంగా పలక రిస్తున్నట్టనిపించింది.

కానీ–ఇంటిదగ్గర ఎజ్‌డీ మోటారుసైకిలు ప్రస్తావన వచ్చేసరికి' ఇంట్లోవున్న అందరి దగ్గరనుండీ అనుకోనివిధంగా అతనికి వ్యతిరేకత ఎదురైంది.

'సైకిలే తొక్కలేవు. నీ మొహం. నీకు మోటారుసైకిలు ఎందుకూ?' అన్నాడతని తండ్రి.

'మోటార్‌సైకిలంటే. అది మన బియ్యంబస్తా అంత బరువుం టుందట. నువ్వు సన్నాగారిపడలా వుంటావుకదా దాన్నేం మోస్తావురా కన్నా?' అన్నది బామ్మ.

'గట్టిగా గాలివీస్తే చాలు ఆ రెండుచక్రాలబండి ఇట్టే కిందపడి పోతుందట. కిందపడ్డప్పుడు దెబ్బలు తగిలినవాళ్ళను చూశాను. ఎంత పెద్ద దెబ్బలో....వొద్దురా బాబూ అటువంటి సాహసపు పనులు చేయకు. ఒక్కగానొక్క బిడ్డవు!' అన్నది దాదాపు కన్నీళ్ళతో అతనితల్లి.

అయినా, వాళ్ళమాటలేవీ అతణ్ని సంతృప్తిపర్చలేకపోయాయి.

'రేపు సాయంకాలం లోపున ఆ మోటారుసైకిలు నాకు కొనిపెట్టక పోతే, ఈ ఇంట్లో ఇహ నేను వుండను.' అన్నాడు తన బామ్మతో. అతని తల్లివచ్చి ఎంతగా బతిమలాడినా, భోజనం చేయకుండా తలుపు వేసుకుని తన గదిలో కూచుండిపోయాడు. అతని కళ్ళముందు స్వప్నే కనిపిస్తోంది స్వప్న తన నునులేత చేతుల్తో తన నడుంపట్టుకుని, చెవిలో తనకు మాత్రమే వినిపించేట్లు ఓ సినిమాపాటపాడుతూ ఆమె చీరచెంగు అటో దిల్ బహారు అత్తరు పరిమళాన్ని తన మొహంమీద మబ్బు తెరలా పరు స్తుంటే ....ఓహ్ ! కలలుగని, కలలుగని ఆకలికి పేగుల్ని మడత వేసు కుని నీరసపడిపోయిన శశాంకకు ఎట్టకేలకు వాకిట్లో ఎజ్‌డీ మోత వినిపిం చింది. ఆ రాత్రికి రాత్రి, కాలేజీ గ్రౌండ్సులో డ్రైవింగ్ ప్రాక్టీసుచేసి, వోమోస్తరుగా నేర్చుకున్నాడు. మర్నాడు బండికి నంబరునూ, తనకు

టెంపరరీ లైసెన్సునూ తీసేసుకున్నాడు. ఎర్రటి ఎజ్‌డీమీద, ఎర్రటి ఎండలో ఎర్రగా మెరిసిపోతూ, 'నే నరకువేలీ పోతున్నా, అక్కడ మా ఫ్రెండ్సంతా వెయిట్‌చేస్తున్నారు. అంటూ 'టా. టా.' చెప్పి ఇనూ వాళ్ళమాటలు వినిపించుకోకుండా స్వప్న ఇంటికి వచ్చి హారన్ స్విచ్ నొక్కాడు.

అతణ్ని చూసి స్వప్న పెంచుతున్న ఆల్సేషియన్ నల్లకుక్క భౌభౌమంది.

'ఎవరూ?' అంటూ స్వప్న బయటకు వచ్చి, అతణ్నిచూసి ఆశ్చ ర్యంతో 'వాట్ ఎ వండర్—నువ్వేనా?' అన్నది ఐబెక్స్ దిద్దుకున్న పొగకళ్ళను అటూ ఇటూ ఆడిస్తూ.

'అన్నట్టుగా వచ్చేశాను. పద పోదాం!' అన్నాడు శశాంక.

'ఎక్కడికి?' అన్నది స్వప్న ఏమీ తెలియనట్లు. అమాయకంగా.

'అరకులోయలో మన ఫ్రెండ్సు దగ్గరకు.'

స్వప్న సమాధానం చెప్పకుండా, అతణ్ని లోపలకు తీసుకువెళ్ళింది. ఓ సోఫాలో కూచోబెట్టి, ఫ్యానువేసింది.

'నీకు కాఫీ ఇష్టమా? టీనా.' అని అడిగింది.

'నే నడిగింది అరకులోయ సంగతి—'

ఆమె రికార్డుప్లేయర్ ఆన్‌చేసింది. సన్నగా వాయిద్య సంగీతం వినిపించసాగింది.

'పోసీ కికాపూకానీ డబుల్ సెవెన్ కానీ.'

'అవేం వొద్దు మన జాలీరైడ్ సంగతి,' శశాంక అసహనంగా అడిగాడు.

ఆమె లోపలకువెళ్ళి పొగలుదేరుతున్న కాఫీ కప్పుతో తిరిగివచ్చింది.

'తీసుకో, మళ్ళీ చల్లారిపోతుంది.'

అతనికి తీసుకోక తప్పలేదు. కాఫీ తాగుతుండగా అన్నది.

'నిన్నందరూ కవర్డు అంటారని నీకు తెలుసా?'

శశాంక చటుక్కున తలెత్తాడు.

'నో యూ ఆర్ నాట్ ఎ కవర్డ్? యూ ఆర్ బ్రేవ్! నీకు మోటారు సైకిలు లేదు. నాకు తెలుసు. నీకు డ్రైవింగ్ రాదు. అదీ నాకు తెలుసు. కాని నా కిచ్చిన మాటకోసం మోటార్ సైకిలు కొన్నావు. డ్రైవింగ్ నేర్చు కున్నావ్ ఫైన్—వెరీఫైన్! మనం అరకువేలీకి వద్దు నీతో అందాకా రాలేను. సాయంకాలం సినిమాకు వస్తాను. బీ రెడీ'

శశాంకకు అంతలో నిరాశ. ఇంతలో సంతోషం.

'అరకులోయకు ఎందుకురావూ?' అన్నాడు.

'లోయల్లోకి, అఘాతాల్లోకి ఎందుకూ!' అన్నది స్వప్న అర్థ వంతంగా.

ఆ తర్వాత ఆ ఇద్దరూ గోదావరి మధ్యవున్న లంకల్లోకి వెళ్ళారు చాలాసార్లు. లాంచీఎక్కి పాపికొండలమధ్యకు విహారానికి వెళ్ళారు. ఎయిర్ కండిషన్ హోటల్లో వెజిటబుల్ పులావ్ తింటూ, సాయంకాలం పూట ఐస్‌క్రీములు నంజుకున్నారు. జంటగా ఇంగ్లీషు సినిమాలు చూశారు. ముద్దులు పెట్టుకునే ఆ ఇంగ్లీషు హీరో-హీరోయినను చూసి ముసిముసిగా నవ్వుకున్నారు. ఎర్రగుర్రం వాళ్ళను అనేకసార్లు మోసుకు తిరిగిన గరుత్మంతుడు.

'నీ ఎర్రగుర్రం అంటే నా కంటే నీకెక్కువ ఇష్టంలా కని పిస్తోందే.' అన్నది ఒకసారి స్వప్న.

'అవునుమరి. అది నిన్నూ, నన్నూకూడా కలిపిమోస్తోంది కదా!' అన్నాడు శశాంక.

వాళ్ళిద్దరూ ఆ ఎర్రగుర్రంమీద కలిసి తిరిగినన్ని రోజులు పట్టలేదు, వాళ్ళ చదువులు అయిపోయేరోజు రావడం.

ఇద్దరూ ఫైనలియర్ పరీక్షలు రాసేశారు.

చివరిరోజున ఇద్దరూకలిసి ఎర్రగుర్రంమీద అన్నవరంకొండకు వెళ్ళారు. పైనుంచి చూస్తోంటే కింద ఊరు అగ్గిపెట్టెలా కనిపిస్తోంది. పైన కొండమీద ప్రకృతి పచ్చచీరకట్టుకుని నిత్య పెళ్ళికూతురులా సిగ్గు లొలికేస్తోంది. ఎందరెందరోవచ్చి మొక్కుబడులు తీర్చుకుంటున్నారు. వ్రతాలు చేసుకుంటున్నారు.

సత్యన్నారాయణస్వామి పెద్ద పెద్ద మీసాలు పెట్టుకుని, కళ్ళువిప్పి నిశ్చలంగాచూస్తూ, 'నేను మగదేవుణ్ని! అన్నమాట తప్పనుసుమా!' అంటున్నాడు.

స్వప్న నిశ్చలంగా కళ్ళుమూసుకు నిలబడింది. రెండుచేతులూ జోడించి మనసులోనే మౌనంగా ప్రార్థించింది.

ఆమెవేపే చూస్తున్నాడు శశాంక. అటుపక్కగా దేముడు. ఇటు పక్కగా స్వప్న, వెనగ్గా కళ్ళింతలు చేసుకుని తమనే చూస్తున్నభక్తులు.

'ఏం బాబూ, హారతీమంటారా? గోత్రం చెప్పండి. ధర్మపత్నీ సమేతస్య—'పూజారి యాంత్రికంగా చదువుకుపోతున్నాడు.

'కాదు కాదు, మేం ఇద్దరం—' శశాంకకు ఏం చెప్పాలో, క్షణం సేపు తోచలేదు.

'ఇంకా భార్యాభర్తలం కాలేదు' స్వప్న గంభీరంగా అంది, 'హారతియ్యండి. చాలు.'

ఇద్దరూ బయటకువచ్చి, కాసేపు మంటపంలో కూచుని, ఆ పక్కనే వున్న పువ్వుల తోటలోకి వెళ్ళారు. పైన పరుగెత్తే మబ్బులు....కింద రోడ్డుమీద పరుగెత్తే కార్లు .... కాళ్ళకింద మెత్తగా గడ్డి .... కళ్ళమీద మత్తుగా వాలే పూలు. స్వప్న అతనికి దగ్గరగా వచ్చింది. అతని చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంది. ఛాతీమీద తల ఆనించి కళ్ళు కిందకు వాల్చి మెల్లగా అన్నది. 'శంకూ! రేపు మా నాన్నారు నన్ను హైదరాబాదు పంపించేస్తున్నారు!' శశాంక ఉలిక్కిపడ్డాడు. ఎందుకూ ?

'వయసొచ్చిన ఆడపిల్లను ఎవరింటికో ఒకరింటికి పంపించాల్సిందేగా! అందుకు నాందిగా అక్కడకు....'

'అంటే పెళ్ళిచూపులకా?' శశాంక కోపంగా అడిగాడు.

'కరక్ట్! అందుకే....'

శశాంకకు తరవాత ఏమనాలో తోచలేదు. తన గొంతు వణుకుతుండగా, 'వెళ్తున్నావా ?' అన్నాడు.

'ఏం వెళ్ళొద్దంటావా ?'

'వద్దు' అందామనుకున్నాడు. కాని అనలేకపోయాడు.

స్వప్న ఉన్నట్టుండి అడిగింది. 'శంకూ ! – డోన్ట్ యూ లవ్ మీ'

శశాంక పేలవంగా నవ్వాడు, తలాడించాడు. 'నీకు .... నీకు .... తెలీదూ !'

'నాకు తెలుసు. కానీ మా నాన్నకు తెలీదు. రేప్పొద్దున్న 'సువ్వొచ్చే సరికి నేను నీకోసం రెడీగా వెయిట్ చేస్తుంటాను. మా నాన్నారికి చెప్పేసెయ్ ?'

శశాంక తలాడించాడు. స్వప్న హుషారుగా ఓ తెల్లగులాబీని కోసి అతని చేతి కందించింది తన తల్లో తురమమని. ఆమె తల్లో—ఆ గులాబిని తురుముతుండగా అతని చేతులు వణికాయి.

స్వప్నను ఆమె ఇంటిదగ్గర డ్రాప్‌చేసి తన యింటికి తిరిగివచ్చి ఆరాత్రి తండ్రిదగ్గర ప్రస్తావన చేయబోయాడు. ధైర్యం చాలిందికాదు. మర్నాటి ప్రొద్దున్న 'పోనీ బామ్మతో చెబ్దాం?' అనుకుని ఆమెగదిలోకి వెళ్తే ఆమె మూలుగుతూ జ్వరం వచ్చిందంటూ ముసుగుదన్ని పడుకుంది. తల్లితో మాట్లాడాలంటే ఆమె వంటగదిలో సతమతమై పోతోంది.

పొద్దున్నే పనిమనిషివచ్చి పనిచేసి వెళ్ళిపోయింది. ఆరున్నర.

తండ్రి దేవుడిగదిలో గాయత్రీపూజ ఆరంభించాడు. ఏడు దాటినట్టు లెక్క. రెండోవిడత కాఫీలుకూడా అయిపోయాయి. గడియారంలో పెద్ద ముల్లు పన్నెండుమీదా, చిన్నముల్లు ఎనిమిదిమీదా నిలబడ్డాయి. శశాంకకు ముళ్ళమీద కూచున్నట్టుంది. పడుకున్నచోట కూర్చోలేక పోతున్నాడు. కూర్చున్నచోట నుంచోలేకపోతున్నాడు. అటూఇటూ కాలుగాలిన పిల్లిలా

తిరుగుతున్నాడు. వీధిలో, పిల్లలు కాన్వెంటుకు బయల్దేరుతున్న సూచనగా రిక్షాల హడావిడి.

అతను గబగబా డ్రెస్ మార్చుకున్నాడు. సెంటెడ్ హెయిర్ ఆయిల్ తలకు రాసుకుని, గిరజాల జుట్టు మొహంమీద పడేట్లు తల దువ్వుకున్నాడు. లైట్‌గా పౌడరు రాసుకున్నాడు. ఎర్రగుర్రం స్టార్ట్‌చేసి స్వప్న ఇల్లు చేరుకున్నాడు.

స్వప్న పెంచిన నల్ల అల్సేషియన్ అతన్నిచూసి 'భౌ భౌ' మనలేదు.

గేటు తెరిచిన దర్వాన్‌మాత్రం 'బేటీ ఇంట్లో నై సాబ్! హైదరాబాద్ కో చల్‌గయా.' అన్నాడు మణిప్రవాళ భాషలో.

శశాంకకు నవనాడులూ కుంగిపోయాయి. 'ఎర్రగుర్రం' తేలిపోతున్న కాళ్ళలో మెల్లగా ముందుకు కదిలింది.

ఈ కథంతా అపర్ణకు తెలీదు. అపర్ణను తను పెళ్ళి చేసుకుని, ఎర్ర గుర్రంమీద వెనగ్గా కూచోబెట్టుకుని, 'స్టార్ట్ మై రెడ్ హార్స్!, అంటే అది కోపంగా కదలకుండా మొరాయించి డబ్‌డబ్ శబ్దంచేస్తే 'ఎందుకండీ ఈ వెధవ డొక్కు మోటారుసైకిలు! ఎంచక్కా వోబజాజ్ ప్రియా కొందురూ?' అంటే ఆ 'ఎర్రగుర్రం' ఎంత బాధపడిందో. బాధపడ్డ తన గుండెకే తెలుసు? తమ ఇద్దరిదీ ఓ వెకానబాధ! ఇంకొకరితో చెప్పుకోలేని మూగ బాధ!

అంతవరకూ హుషారుగాపరుగెత్తుతున్న 'ఎర్రగుర్రం' హఠాత్తుగా పెద్దగా సకిలిస్తూ ఆగిపోయింది.

'ఏమైంది మైడియర్....?' శశాంక మెల్లగా దిగి ఆ ఎజ్‌డీని శల్య పరీక్ష చేశాడు. ఏంలోపం కనబడడం లేదు. కానీ అది స్టార్టు మాత్రం కావడం లేదు.

చుట్టూ చూశాడు. మెలికలు తిరుగుతూ మిట్టపల్లాలతో ముందుకు సాగుతున్న నల్లజర్ల రోడ్డు ప్రాణిసంచారం అంతంత మాత్రంగా వుంది. పొలాల్లో ఇంజన్లు పెట్టి నీళ్ళు తోడుతున్నారు. నీళ్ళు పడ్డచోట పచ్చగా,

ఏపుగా పెరిగినచెరకు. రోడ్డుపక్క ఎండిపోయిన కాల్వలు. అక్కడక్కడా నీడలు పరుస్తున్న పెద్ద పెద్దచెట్లు.

'హలో — ఎనీ ట్రబుల్ ? ...' రోడ్డుమీదపోతున్న ఓజీపు శశాంకనుచూసి సానుభూతిగా ఆగింది. జీపులోనుండి వో ఆజానుబాహువుదిగాడు. అతను దిగడంచూసి పక్క పొలాల్లో వున్నవాళ్ళు పరుగెత్తుకుంటూ వచ్చి, తలగుడ్డలు చేతుల్లోకి తీసుకుని, 'దణ్ణాలండి బాబూ!' అన్నారు'.

శశాంక సమాధానం చెప్పేలోపునే, 'డ్రైవర్-ఆ ట్రబుల్ ఏమిటో చూడు!' అన్నాడు ఆ అజానుబాహువు.

డ్రైవర్ దిగి ఎర్రగుర్రాన్ని పరీక్షించాడు. 'షెడ్‌కు చేరిస్తేకాని చెప్పలేంసార్!' అన్నాడు నమ్రతగా.

'ఓ కె.! ఒరేయ్-సాంబయ్యా! నువ్వూ నర్సింలూ కలిసి ఆ మోటారు సైకెల్ను భీమడోలులో మన షెడ్డుకు చేర్చండి!' అని 'కమిన్ ప్లీజ్! సాయంకాలం ఐంది. ఈ రోడ్డుమీద మీరు వెయిట్ చెయ్యలేరు రాత్రికి మా ఇంట్లో రెస్టు తీసుకోండి. ప్రొద్దున్నే వెళ్ళొచ్చు.' చనువుగా శశాంక చేతిలోవున్న బేగ్‌ను తనచేతిలోకి తీసుకున్నాడు. శశాంక పడమటి వైపు చూశాడు. సూర్యుడు నిద్రకు సిద్ధమౌతున్నాడు. చెట్లు నీలిమను కప్పుకుంటున్నాయి. రోడ్డు వంటరిగా బేలగా వుంది.

శశాంక ఆ కొత్తమనిషివెంట గట్లమీదుగా నడుస్తూ, చేలమధ్యనున్న ఓ వంటరి భవంతిని చేరుకున్నాడు.

'ఈ పొలాలమధ్య ఇల్లేమిటనుకున్నారా? నాకు ప్రశాంతత అంటే ఎంతో ఇష్టం. చిన్నప్పటినుంచీ హైదరాబాదులో పెరిగి, ఆ పట్నం శబ్దాలు విని, నా గుండె మొద్దై పోయింది. నా చెవులు దిబ్బెళ్ళు పడ్డాయి. అదృష్ట వశాత్తు నాభార్యక్కూడా ప్రశాంతత అంటే ఎంతో ఇష్టం. అందుకనే ఈ చేలో ఇల్లు కట్టుకున్నాను. కరెంట్ వుంటే, అడవిలో వున్నా, సముద్ర మధ్యలోవున్నా మనకేం తేడా తెలీదు. ఏమంటారు?' అతను తలుపు తట్టాడు.

'వచ్చే వచ్చే....!' ఆ గొంతు ఎవరిది! శశాంక గుండె తొందర తొందరగా కొట్టుకుంది. ఆ అడుగుల చప్పుడు ఎవరిది! శశాంక లోలోపల తెలిసిన తంత్రులేవో స్పందించాయి. ఆ గాజులచప్పుడు ఎవరిది? శశాంక మనసు పిరికిగా ఎదురుతెన్ను చూసింది.

తలుపు తెరిచింది ఒక వెన్నెలతీగ.... ఒక నవ్వుల మొలక... ఒక తరంగ రేఖ. స్వప్న!!

'స్వప్నా!' అన్నాడు శశాంక స్వప్నంలోనుండి తేరుకున్నట్లు.

'నువ్వా!' ఆమె కంఠంలో ఏభావమూ లేదు. 'ఈయనెక్కడ దొరి కాడు మీకు' ఆమె భర్తవేపు చూస్తూ అడిగింది.'

'నల్లజర్ల రోడ్డుమీద! చీకటి పడుతోంది కదా. అక్కడే వుండిపోతే– రేప్పొద్దుటికి అద్రసుండదని ఇంటికి తీసుకొచ్చా! తీరాచూస్తే మీరిద్దరూ ఓల్డ్‌ఫ్రెండ్సులా వున్నారు. ఐయామ్ గ్లాడ్!....'

ఆ ఆజానుబాహువు, శశాంకను లోపలకు తీసుకువెళ్ళాడు. స్వప్న తమముగ్గురికి డైనింగు టేబులుమీద భోజనం ఏర్పాటు చేసింది. హాట్ మీల్స్. భోజనానికి ముందుగా ఓ గ్లాసులో జిన్ పోసి, 'హేవ్ ఇట్ మై గెస్ట్!' అన్నాడు స్వప్న భర్త.

'నాకు–నాకు అలవాటు లేదండీ!' శశాంక బిడియంగా అన్నాడు. ఆమాటవిని ఆయన పెడీ పెడీ నవ్వాడు. నవ్వుతున్నప్పుడు ఆయన బుగ్గ మీసాలు అటూ ఇటూ ఊగులాడాయి. 'మీరేం మగవాళ్ళండీ,' అంటూ 'జిన్ ఆఫ్టరాల్–ఎపిటైజర్, అంతే' అన్నాడు.

భోజనాలు ముగించింతర్వాత బైట వెన్నెట్లో పక్కలు వేస్తోంది స్వప్న.

'మన గెస్టుకి పక్కవేసి, నువ్వేసుకో ఆ పక్కన. కబుర్లు చెబుతూ పడుకోండి. నాకు గరాజ్‌లో పనుంది. వెళ్ళాలి' అన్నాడు, ఆ ఆజాను బాహువు. స్వప్న ఆయనవేపు పలుకూ పులుకూ చూసింది. ఆయన కన్ను లరమూతలుగా మూసి 'గుడ్‌నైట్' చెప్పి వెళ్ళిపోయాడు.

'ఇదీ వరస' అన్నది స్వప్న తమలపాకుల పళ్ళెం తీసుకువచ్చి, ఆకుల్ని చీల్చి, సున్నం రాస్తూ.

శశాంకకు అంతా అగమ్యంగా వుంది. స్వప్నలో ఏమీ మార్పు లేదు. అదే చలాకీతనం, ఆదే అందం. తనమీద అదే నమ్మకం.

తమలపాకులు చిలకలు చుట్టి చేతి కందిస్తోంది స్వప్న. వేళ్ళకు వేళ్ళు తగులుతున్నాయి. శశాంకవేళ్ళు వెచ్చబడుతున్నాయి. స్వప్న వేళ్ళు చల్లగా ఉన్నాయి.

స్వప్న తనకు కావాలనే తన వేళ్ళను తగిలిస్తోందా? తనలో ఎందుకూ ఇంత ఉద్వేగం ?

'మూడేళ్లైంది మా పెళ్ళయి ఇంట్లో పిల్లా - పీచూ లేదు. ఆయనకు ఇల్లుపట్టదు మేం ఇద్దరం కలిసున్న క్షణంలేదు. ఎంత ఒంటరితనమో నీకెట్లా తెలుస్తుంది!'

స్వప్న దిండుమీద మోచేయి నానించి, ఆ మోచేతి నానుకుని పడుకుంది. ఆ పడుకోడంలో పమిటచెంగు తొలగి కింద పడిపోయింది. ఆయినా ఆమె పట్టించుకోలేదు.

'పడుకోలే నీకు నిద్ర వస్తున్నట్లుంది. నువ్వు మీ ఆవిణ్ని గురించి చెప్పనేలేదు. నీ కెంతమంది పిల్లలు. మీ ఆవిడ ఎట్లా వుంటుంది. శశాంక సమాధానం చెప్పేలోపునే స్వప్న నిద్రాదేవత వొడిలోకి జారిపోయింది. వెన్నెల్లో తమలపాకు ఎర్రదనం నింపుకున్న ఆమె పెదిమలు ఆహ్వానిస్తున్నట్లుగా కొద్దిగా విచ్చుకుని వున్నాయి. పైట తొలగిన ఆమె వక్షస్థలం శశాంకలో అగ్ని పర్వతపు భుగభుగల్ని రేపడం మొదలెట్టింది. అతను మెల్లగా లేచి ఆమెను సమీపించి ఆమె మొహం దగ్గరగా తన మొహాన్ని ఆనించాడు. ఆమె ఊపిరి వెచ్చగా తగిలింది. ఆమె మెల్లగా అటు కదిలినట్లయింది. గభాలున వెనక్కువచ్చి తను మంచం పట్టిమీద కూచున్నాడు.

స్వప్న కొద్దిగా కళ్ళుతెర్చి, 'ఇంకా నువ్వు నిద్రపోలేదూ ? — పడుకో .... పడుకో ....' అంటూ అటువైపుగా తిరిగి పడుకుని మళ్ళీ నిద్రలోకి జారుకుంది.

శశాంకను ఆలోచనల కందిరీగలు కుడుతున్నాయి. 'తను వాగ్దానభంగం ఎందుకు చేశావని అడగదేం ? ఆరోజు ప్రొద్దున్న వస్తానని రాలేకపోయినందుకు తనను కొట్టికోరతన వేయదేం ? తనను దోషిగా నిలబెట్టి శిక్షించదేం ? ఇంకా స్వప్నకు తనమీద మనసు వున్నట్టే వుంది. అందుకే అన్నది తనకు పెళ్ళై మూడేళ్ళయినా పిల్లా - పీచూ కలగలేదని. అందుకే అడిగింది తనకు పిల్లలెంతమందీ అని ?

శశాంకకు ఆ ఆలోచనలతోనే తెల్లవారింది, స్వప్న స్నానం చేసి, మల్లెపువ్వులా తయారై నుదుటిపైన తిలకం దిద్దుకుని, కాఫీకప్పుతో అతని దగ్గరకువచ్చి, స్వచ్ఛంగా నవ్వుతూ, 'రాత్రంతా నువ్వు నిద్రపోనేలేదు కదూ?' అన్నది అతని కళ్ళలోకి చూస్తూ.

శశాంక ఆమె చేతుల్లోనుండి కాఫీకప్పు నందుకున్నాడు. తనూ ఆమె కళ్ళల్లోకి చూశాడు. 'స్వప్నా ! ఒకప్రశ్న అడుగుతాను. సమాధానం చెబుతావా ?' ఇంకా నువ్వు నన్ను ప్రేమిస్తూనే వున్నావా ?'

స్వప్న ఆ ప్రశ్నను నమ్మలేనట్టుగా విని 'ఎంత ధైర్యం' అన్నది పెద్దగా.

'మా ఆయన్ని రానీ ! ఆయన్నడిగి చెపుతాను.'

శశాంక మొహం నల్లగా మాడిపోయింది. 'సారీ స్వప్నా!' అతను మెట్లుదిగి, ఆ ఇంట్లోనుంచి బయటపడి చేలకు అడ్డంబడి నడవసాగాడు. బ్యాగ్ తీసుకుని.

'శంకూ ఎక్కడికి వెళ్తున్నావ్ ?' వెనకనుంచి స్వప్న పెద్దగా పిలుస్తోంది.

శశాంక ఓ చేనుమధ్యగా నిలబడి వెనక్కు తిరిగిచూస్తు అన్నాడు. 'గరాజ్ దగ్గరకు వెళ్తున్నాను ఎర్రగుర్రం బాగైతే వెళ్ళిపోతాను.'

శశాంక గబగబా అడుగులువేస్తూ నడవసాగాడు. చేలల్లోనుండి పుడమితల్లి కడుపు చీల్చుకుని వో మధురమైన పరిమళం !

అతను గరాజ్‌దగ్గరకురాగానే మెకానిక్ ఎర్రగుర్రాన్ని అందించాడు

'మీ అయ్యగారేరీ ?'

'భీమడోలు వెళ్ళారండీ' మీరొస్తే ఈ మోటారుసైకిల్ను హాండ్ ఓవర్ చేయమన్నారు !'

శశాంక తలూపి ఎర్రగుర్రాన్ని మెల్లగా నడిపించుకుంటూ రోడ్డెక్కాడు. ఓ చెట్టునీడలో స్టాండు వేశాడు.

ఎదురుగా ప్రకృతి ప్రశాంతంగా వుంది. ఎంతో పవిత్రంగా వుంది. చెట్టుచాటు నీడనుండి స్వప్న అతని ఎదుటికి వచ్చింది.

'శంకూ' శశాంక ఉలిక్కిపడ్డాడు.

'నీ ప్రశ్నకు సమాధానం తెలిసికోకుండానే వెళ్ళిపోతున్నావేం? ఇంకా నిన్ను నేను ప్రేమిస్తున్నానా లేదా అనేకదా నీప్రశ్న? ప్రేమిస్తున్నాను శంకూ, అందుకే నీతో లేచిపోవడంకోసం వచ్చేశాను. ఎర్రగుర్రం ఎక్కమంటావా ?

శశాంకకు నోటమాట రాలేదు.

'నిజంగా, నిజంగా నన్ను—నువ్వు—' అతను నీళ్ళు నములుతున్నాడు.

ఇంతలో భీమడోలువైపునుండి జీపులో స్వప్న భర్త వచ్చాడు. జీపునిండా ఆడవాళ్ళూ పిల్లలూ!

'హలో స్వప్నా ! ఎందుకు రోడ్డుమీదకు వచ్చావ్? మీ అత్తగార్నీ ఆడబిడ్డనీ అంపర్ని ఇంటివగ్గరే రిసీవ్ చేసుకోవచ్చుగా. అందుకు ఇంత దూరం ఎదురుకోలు రావాలా ? యూనాటీ గర్ల్. ఇదమ్మా నీకోడలి వరస ! అన్నట్లు మీ ఫ్రెండ్‌గారి మోటారుసైకిలు బాగైపోయినట్లుంది, వెరీగుడ్.'

ఆ ఆజానుబాహువు అట్లా మాట్లాడుతూనే వున్నాడు. స్వప్న అత్తగారి దగ్గరకు వెళ్ళి ఆమెకు నమస్కరించింది. ఆడబిడ్డను ఆదరంగా పల్కరించింది. చిన్నపిల్లలను ముద్దులాడింది. స్వప్న నెక్కించుకొని జీపు ఆమె ఇంటివైపుగా బయల్దేరింది. రోడ్డుమీద శశాంక ఒంటరిగా నిలబడిపోయాడు, ఎర్రగుర్రాన్ని ఎదురుగా పెట్టుకుని! తను ధైర్యస్థుడా? పిరికివాడా అతనికే తెలీడంలేదు.